క్లుప్తంగా

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తా



పీహెచ్‌సీ అభివృద్ధిపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

పెరవలి: పెరవలి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు ఆర్‌ఎస్‌ఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో తూర్పు, పడమర ప్రహరీలు పడిపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని, ఆసుపత్రిలో మందులు నిల్వకు మరోరూమ్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఈ మేరకు ఆసుపత్రి ప్రాంగణంలో సమస్యల పరిష్కారానికి మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకువెళ్లేందుకు ఎంపీపీ కాచ్చెర్ల ప్రసాద్ కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గంగోలు సీతమ్మ, గార్లపాటి నాగసుధ, పీహెచ్‌సీ వైద్యురాలు ఈ తేజశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



పీహెచ్‌సీలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే తదితరులు

తాళ్లపూడి: గ్రామాలన్ని పరిశుభ్రంగా ఉంటే ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని అన్నదేవరపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను, పీహెచ్‌సీని ఆవరణలో ఉన్న పాత భవనాన్ని తొలగించి, కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

నిడదవోలు (ఉండ్రాజవరం): తణుకు మండలం తేతలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమత్తులు, నిర్వాహణ నిమిత్తం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తాడేపల్లిగూగెం విద్యుత్ డివిజన్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంధీరానగర్, తేతలి, వడ్లూరు, చివటం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వెల్లడించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



యోగా పోటీల్లో పాల్గొన్న బాలికలు

నల్లజర్ల: దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను యోగాతో నియంత్రిచవచ్చని జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. స్థానిక కింగ్స్ ఉడ్స్ స్కూలులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యోగా జట్టు ఎంపిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సీహెచ్‌ఆర్‌కే వర్మ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు సెప్టెంబరు 6,7 తేదీల్లో ద్వారకాతిరుమలలో జరుగనున్న 50వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల సింగపూర్‌లో జరిగిన పదో ఏషియన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న విజేతలు శిరీష, ఆర్మిత, భవానీలను సత్కరించారు.

నేడు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

నిడదవోలు రూరల్: ప్రకాశం జిల్లా చేవూరులో నిర్వహించే రాష్ట్ర సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు పశ్చిమ గోదావరి జట్టు ఎంపిక కోసం ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆసక్తి గల క్రీడాకారుల అభ్యర్థులు జనవరి 2010 ఏడాది తరువాత జన్మించి ఉండాలని ఆధార్‌తో పాటు 6 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

అంతరిక్ష రంగంలో గణనీయమైన విజయాలు

నిడదవోలు రూరల్: అగ్రదేశాలకు పోటీగా అంతరిక్షంలో భారత్ గణనీయ విజయాలు సాధిస్తోందని నాసా ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగామ్ విద్యార్థిని కుంచాల కైవల్య రెడ్డి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని సమిశ్రగూడెం వికాస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచానికి ఏవిధంగా ఆదర్శంగా నిలుస్తోందో కొనియాడారు.

పడకేసిన పశుబీమా

- కూటమికి పట్టని పాడిరైతుల కష్టాలు
- పశువుల మృత్యువాతతో ఆవేదన
- ప్రీమియం కట్టించుకోవాలని డిమాండ్

నిడదవోలు రూరల్: రైతులకు పాడి..పంట రెండు కళ్లలాంటివి. ఈ రెండు రంగాలు ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి. వేడినీళ్లకు చన్నీళ్ల సాయంలా వ్యవసాయంతో పాటు పశుపోషణ చేస్తేనే రైతుల ఆర్థిక పురోగతి బాగుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది నేటికి పశుపోషణే జీవనాధారం. సీజనల్ వ్యాధుల సంక్రమించడం, ప్రమాదాల కారణంగా పశువులు ఆకాల మరణం చెందుతున్నాయి. దీంతో పశుపోషకులకు తీవ్ర నష్టం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో పశువులు, మేకలు, గొర్రెల పోషకులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం పశు బీమాకు మంగళం పాడింది. దీంతో పాడినే నమ్ముకొన్న వారంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీమా లేకపోవడంతో

బీమా సౌకర్యం కల్పించాలి..



ప్రభుత్వం ద్వారా ఆవు, గేదెలకు బీమా సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తామని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తే ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారు. ప్రస్తుతం పాడి గేదె కొనాలంటే రూ.80 వేల నుంచి రూ.లక్ష అవుతోంది.

కస్తూరి వీరవెంకట విద్యాసాగర్,
పాడిరైతు, సమిశ్రగూడెం



సమిశ్రగూడెంలో పాడి పశువులు

పశువులు మృత్యువాత పడితే నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

నియోజకవర్గంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 27,023 పశువులున్నాయి. వాటిలో గేదెలు 18,581, ఆవులు 3,052, గొర్రెలు 2,884, మేకలు 2,506 ఉన్నాయి. వీటన్నింటికి ఏదైనా ప్రమాదం సంభవించి చనిపోతే రక్షణగా గతంలో బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీమాను అటకెక్కించింది. దీంతో అనుకొని ప్రమాదం సంభవించి పశువులు మృత్యువాత పడితే భారీ నష్టం చవిచూడాలని వెంటనే బీమా కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

పొంచివున్న వ్యాధులు..

ప్రస్తుత వర్షాకాలంలో గేదెలకు హెచ్‌ఎస్‌బీక్యూ, గాలికుంట, థైలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంది. ప్రాణాంతక



పశువులకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధకశాఖాధికారులు (ఫైల్)

వ్యాధులు సోకడంతో పశువులు తరుచుగా మృత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షాకాలంలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ ఘాతాలు పశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. గతంలో ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో కరెంట్‌షాక్‌తో పశువుల పాక దగ్ధమై ఏడు గేదెలు మృతిచెందాయి. పాడి రైతులు అప్పులకు డబ్బులు తీసుకుని కొనుగోలు చేసిన పశువులు అర్ధాంతరంగా మృతిచెందితే ఆ రైతు పడే బాధ వర్ణనాతీతం. ఈ నేపథ్యంలోనే బీమా పథకాల ద్వారా సహాయం పొందితే పాడి రైతులకు కొంతవరకు ఉపశమనం కలిగిస్తుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా..

అధికారంలోకి వచ్చిన వెంటనే పశుపోషణ అభివృద్ధి కోసం బీమా సౌకర్యం కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీ నీటి మీద రాతగానే మారింది. ఒక్కొక్క గేదె, ఆవుకు రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించి పాడిరైతులు కొనుగోలు చేస్తుంటారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పశుబీమా పథకాన్ని పక్కాగా అమలుచేసింది. రైతు వాటా 3.5 శాతం, ప్రభుత్వం 3.5 శాతం బీమా ప్రీమియం భరించేది. సంకరజాతి ఆవులు, హెచ్‌ఎఫ్, జెర్సీ రకం, గ్రేడెడ్ ముర్రా గేదెలకు ఒక్కొదానికి రూ.30 వేలు వంతున, సాధారణ ఆవులు, గేదెలకు రూ.15 వేల, గొర్రెలు, మేకలు (20 శాల్తీల వరకు) రూ.1.20 లక్షల పరిహారం అందించేవారు. ఈ బీమా కోసం స్థానిక పశువైద్యులను సంప్రదించి ముందుగా చెవికమ్మ వేయించి, రైతు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రర్ చేసేవారు. ప్రమాదాల్లో పాడిసంపదను కోల్పోతే ఎఫ్‌ఐఆర్ నమోదై, పశువులు మరణించినప్పుడు సమీప వైద్యుడు మృతిచెందిన జీవాలను జియో ట్యాగింగ్ చేసేవారు. పశుసంవర్ధకశాఖలోని ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపి రైతుల ఖాతాల్లో నేరుగా బీమా నగదును జమ చేసేవారు. క్షీరసాగర పథకం ద్వారా 6,7 నెలల గర్భంతో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా లేకపోవడంతో పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాయక్

గోపాలపురం: నేటి సమాజంలో యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్ నాయక్ అన్నారు. స్థానిక బీహెచ్‌ఎస్‌ఆర్ అండ్ వీఎల్‌ఎం డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, పోక్సో కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం పోలీసులు, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

గోపాలపురం: మండలంలోని వాదాలకుంటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై పి.మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తిసుకుని వారి నుంచి రూ.50,107 నగదును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. మండలంలోని అసాంఘిక కార్యకలపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాజీ హోంమంత్రి కుటుంబానికి పరామర్శ



వనిత దంపతులను పరామర్శిస్తున్న నాయకులు చెల్లుబోయిన, జక్కంపూడి, తలారి తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): మాజీ హోంమంత్రి తానేటి వనిత మావయ్య, తానేటి బాబూరావు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు తాడేపల్లిగూడెంలో శనివారం తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డీనేటర్ తలారి వెంకట్రావు తదితరులు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వనిత ఆమె భర్త డాక్టర్ శ్రీనివాస్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాబురావు చిత్ర పటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హోంమంత్రి దంపతులకు పరామర్శ

గోపాలపురం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, తానేటి వనిత మామగారు బాబూరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు శనివారం దేవరపల్లి మండల వైఎస్సార్ సీపీ నాయకులు దంపతులను పరామర్శించి బాబూరావు చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొడవటి బుజ్జిబాబు, మారిశెట్టి బాబుగౌడ్, మల్లిపూడి రాంబాబు, కొత్తపల్లి ప్రసాద్, గందిపోము దాసు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వనితను పరామర్శించిన నాయకులు

నల్లజర్ల: మాజీ హోంమంత్రి తానేటి వనితను నల్లజర్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, మహిళా విభాగం అధ్యక్షురాలు యజ్ఞవరపు లక్ష్మి, ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, నల్లజర్లకు చెందిన కండెపు రాజేశ్వరీ, వామిశెట్టి పరమేశ్వరావు, తొమ్మండ్రు రమేష్, చిక్కాల నాగేశ్వరావు, పిచ్చుకుల ప్రసాద్, ముప్పిడి వెంకటరత్నం, అచ్యుత శివాజీ, ప్రగడ వెంకటేశ్వరావు, చెల్లారి రామశ్రీనివాస్, అందుగుల వెంకటేశ్వరావు, పెనుమాక వెంకటరత్నం, రాజ్‌కుమార్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

25న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మెరికమ్మ

చాగల్లు: క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులని ఈ నెల 25 నుంచి పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, రేషన్ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాల ఉద్యోగుల ద్వారా కార్డుదారుల కుటుంబాలకు రేషన్ దుకాణాల వద్ద వాటిని ఉచితంగా అందిస్తున్నామన్నారు. స్మార్ట్ కార్డులో రాజముద్రతో పాటు కుటుంబసభ్యుల వివరాలు క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీతో పాటు స్మార్ట్ కార్డులు అందజేయాలని ఆదేశించారు. మిగిలిన కార్డుదారులందరూ ఒకటో తేదీ నుంచి వారికి కేటాయించిన రేషన్ దుకాణంలో స్మార్ట్ కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఉపాధి కల్పించాలి



వెంకట్రావు

నల్లజర్ల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు కారణంగా ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువయ్యిందని తక్షణమే ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొక్కిరపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. శనివారం నల్లజర్లలో ఆయన మాట్లాడుతూ కరోనా వల్ల ఒకసారి వీరంతా ఆర్థికంగా దెబ్బతినగా, దినదినగండంగా సాగిస్తున్న వీరి జీవితంలో మరోసారి ఫ్రీ బస్సుతో మరింత దెబ్బతింటారన్నారు. ఈ పథకంతో ముందుగా నష్టపోయేది ఆటో వాలలేనని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. జీఓ నంబర్ 21ని రద్దుచేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రవాణా రంగం ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో కోట్లాది రూపాయిల ఆదాయం సమకూరుతున్న నేపథ్యంలో కార్మికులకు, ఆటో డ్రైవర్లకు సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు.

కేసులు పరిష్కరించుకోవాలి



లోక్ అదాలత్‌పై సమీక్షిస్తున్న చైర్మన్ అనురాధ

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు కోర్టు హాల్‌లో సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా జడ్జి ఎం.అనురాధ అధ్యక్షతన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని కేసులు రాజీ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.వి.ఎల్, సరస్వతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగమణి, ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

తాళ్లపూడి(కొవ్వూరు): దీర్ఘ కాలిక కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గం అని చైర్మన్ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం అనురాధ అన్నారు. రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టు ప్రాగణంలో శనివారం ఆము ఆధ్యక్షతన మధ్యవర్తిత్వ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో జులై 10 నుంచి సెప్టెంబర్ చివరి వరుకు మధ్యవర్తిత్వం నిర్వహిస్తునట్టు తెలిపారు. కక్షిదారుల మధ్య మనస్పర్ధలు లేకుండా సత్వర న్యాయం కోసం మధ్యవర్తిత్వం ద్వారా సమన్యాయం జరుగుతుందన్నారు. కోర్టుల్లో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా రాజీపడితే తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకొని ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చునని పేర్కొన్నారు. కేసుల రాజీకి ప్రత్యేకంగా శిక్షణ పొందిన న్యాయవాదులను నియమించినట్టు ఆమె తెలిపారు. కోర్టు పరిధిలోని కక్షిదారులు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నవయసులో గుండెపోటు బాధాకరం



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు

గోపాలపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్‌కె.వల్లీ సతీమణి అత్తర్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నవయస్సులోనే గుండుపోటుతో మరణించడం బాధకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెట్టి గురునాధరావు, దేరవపల్లి, గోపాలపురం ఎంపీపీలు కుప్పాల దుర్గారావు, వుండవల్లి సత్యనారాయణ, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, సాలి వేణు, కూసం రామమోహన్‌రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ నాయకులు పార్థివ దేహానికి నివాళులర్పించారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ హోంమంత్రి తానేటి వనిత వల్లీని ఫోన్‌లో పరామర్శించారు.

జలదిగ్బంధంలో లంకలు




వరద తగ్గుముఖం పట్టడంతో బయటపడిన శివుడు విగ్రహం



కాకరపర్రులో నీటమునిగిన అరటి తోటలు

పెరవలి: గత నాలుగు రోజులుగా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంక గ్రామాల హోడలిపోయారు. శనివారం కొంతమెర నీటిమట్టం తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మంచి గిట్టుబాటు ధర లభించే సమయంలో హఠాత్తుగా వచ్చిన వరదలు రైతులను అప్పుల పాలయ్యేలా చేసిందని గగ్గోలు పెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద సుమారు 11 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదలటంతో లంక గ్రామాలకు ఒక్కసారిగా వదర పోటెత్తింది. నీరు పూర్తిస్థాయిలో లాగడానికి సుమారు వారం రోజుల సమయం పడుతుందని, అప్పటికి పంటలన్నీ కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో నోటికి దక్కకుండా పోయాయని దీనంగా కాలం వెళ్లదీస్తున్నారు.

'సత్యసాయి' కార్మికుల రిలే దీక్షలు



గోపాలపురం మంచినీటి ట్యాంకు వద్ద దీక్ష చేస్తున్న కార్మికులు

గోపాలపురం: గత 10 నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వానికి అధికారులకు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా కార్మికుల గోడు పట్టించుకోవడంలేదని సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు వాపోయారు. నీటి సరఫరాను నిలిపివేసి రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక సత్యసాయి మంచినీటి ట్యాంకు వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జీతాలు చెల్లించేవరకూ దీక్షలు కొనసాగుతాయని హెచ్చరించారు.

సర్పంచ్ మృతి..నేతల నివాళులు



సర్పంచ్ బుల్లారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరపల్లి: మండల కేంద్రం దేవరపల్లిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామన్నపాలెం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కూచిపూడి బుల్లారావు(71) మృతిచెందారు. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి బుల్లారావు మరణం పార్టీకి తీరనిలోటని నేతలు సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెట్టి గురునాధరావు, స్థానిక ఎంపీపీ కేవీకే దుర్గారావు, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

తెలుగు జాతికి ప్రతీక టంగుటూరి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్

నిడదవోలు: ప్రజాభిమానాన్ని చూరగొని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకులు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. శనివారం ఆయన 153వ జయంతిని పురస్కరించుకుని పులమాలలతో చిత్రపటానికి నివాళులర్పించారు. 1899లో రాజమహేంద్రవరంలో హేమాహేమీలను ఓడించి పురపాలిక కౌన్సిలర్‌గా ఎన్నికైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు.

టంగుటూరికి నివాళి

చాగల్లు: ఆంధ్ర రాష్ట్ర సాధనలో ప్రకాశం పంతులుది కీలక పాత్ర పోషించారని తహసీల్దార్ మెరికమ్మ అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి అనేక గొప్ప సంస్కరణలు చేశారన్నారు. తన ఆస్తిని పేదలకు ధారాదత్తం చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో డీటీ కమల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తగా సేవలు అందించాలి



విద్యార్థిని కైవల్యను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: నిడదవోలు పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కుంచాల కైవల్యారెడ్డి ప్రతిష్టాత్మకమైన నాసా ఇంటర్ నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం (ఐఏఎస్పీ)కి ఎంపికై ంది. ఈ మేరకు విద్యార్థిని శనివారం మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. తాను సాధించిన రికార్డులను మంత్రికి వివరించగా చిన్న వయస్సులోనే రాష్ట్రం తరపున అంతరిక్ష పరిశోధనకు ఎంపీక కావడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్‌లో ఖగోళ శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవలందించాలని ఆయన ఆంకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సత్కారం..

పట్టణంలోని నారాయణ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని కుంచాల కైవల్యారెడ్డి నాసా ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం(ఐఏఎస్పీ)కి ఎంపిక కావడం పట్ల రోటరీక్లబ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆమెను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.